
# కథా ప్రహేళిక -2



# PM 412

పాతదేశ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం ఏడు గంటలు...

ఆ దేశపు ఉద్యోగస్థులంతా చలికి వణుకుతూ నిద్రమత్తు మొహాలతో టీవీల ముందు కూర్చున్నారు.

క్రమంగా అంకెలు మారి ఏడు చూపించింది బుల్లితెర.

న్యూస్‌రీడర్ మొహం బుల్లితెర మీద ముసిముసి నవ్వులతో ప్రత్యక్షమైంది.

వివిన మూర్తి

"పాతదేశపు 412వ ప్రధానమంత్రి ఈ రోజు అర్ధరాత్రి 12.00 గంటలకు ప్రమాణ స్వీకారం చేశారు.

ఆయన ప్రధానమంత్రి అయిన సందర్భంలో రష్యా చైనా ఇండియా మొదలైన అనేక దేశాల నుంచి ముందుగానే శుభాకాంక్ష సందేశాలు అందాయి.

గడచిన 411 వారాలుగా ప్రజలు నవ్యోత్సాహంతో, హంగూ అర్భాటాలతో రకరకాల దుస్తులు ధరించి జరుపుకుంటున్న మహోత్సవం నిన్ననే ముగిసిందని మా ప్రత్యేక విలేఖరి తెలియజేస్తున్నారు. వార్తానంతరం ఈ ఉత్సవం తాలూకు ముఖ్యాంశాలు చూపించ బడతాయి.

నూతన ప్రధానమంత్రి దేశప్రజలకు శుభాకాంక్ష సందేశంలో కులమత కలహాలను కూకటి వేళ్ళతో కూల్చివేస్తామని, క్రీ.శ. 19,999 నాటికి పాత దేశంలో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని, పేదరికాన్ని పెకిలించివేస్తామని హామీ ఇచ్చారు.

పాతదేశం సురినామ్‌తో జరిగిన ఒక గంట క్రికెట్ ఆటలో ఓడిపోయింది.

ఇప్పుడు మీరు వార్తలను వివరంగా వింటారు."

టీవీలను ఆఫ్ చేసి పాతదేశపు ఉద్యోగస్థుల భార్యలు భర్తలను కోపంగా చూశారు. వారు దీనంగా చూశారు.

"... ఏ వార్త కోసమైతే దేశోద్యోగులు ఎదురు చూస్తారో ఆ వార్తను ముఖ్య వార్తగా ప్రసారం చేయాలన్న చిన్న డిమాండ్‌ను మీరు నెగ్గించుకోలేకపోతున్నారు. ఎందుకొచ్చిన యూనియన్లూ? తుంగలో తొక్కనా?" - భార్యలు చూపుల తూపుల్తో పొడిచి పారేసి వంటగదుల్లోకి నడిచారు. భర్తల పిడికిళ్ళు ఆవేశంతో బిగుసుకుపోయాయి.

ఆశావహులయిన కొందరు మళ్ళీ టీవీలు ఆన్ చేసి ముఖప్రక్షాళనలో పడ్డారు.

ప్రధానమంత్రి ప్రమాణస్వీకారోత్సవ దృశ్యాలను చూపారు టీవీవారు. పాతదేశ న్యాయాధీశులూ, చతుర్దళ సైనికాధిపతులూ, తదితర ప్రముఖులూ ప్రధానమంత్రి పరిపాలనా కాలంలో తమ పూర్తి సహకారం ఉంటుందని చెప్పడం చూపించారు. విదేశాల నుండి అందుతున్న శుభాకాంక్షల కట్టలనూ, అమెరికా రష్యా చైనాల అధ్యక్షులనూ అడావుడిగా చూపించారు. ప్రజల ఉత్సవాలనూ, ప్రధానమంత్రిపై వారి స్పందనలనూ చూపించారు.


ఆ తర్వాత పాత ఉద్యోగులు ఎదురు చూసే వార్త ప్రసారం ఆరంభమయింది.

298 ప్రధానమంత్రి తీసుకువచ్చిన కబుర్లాడుకునే పరికరాల చట్టం ప్రకారం సోమవారం నాడు ప్రధానమంత్రుల మరణాల కోసం సెలవు ప్రకటించే విధానాన్ని కొనసాగిస్తామని వర్తమాన ప్రధానమంత్రి ప్రకటించారు. అయినప్పటికీ పాతదేశంలో

కమ్యూనికేషన్లు పాడవటం వలన యింతవరకు ఏ మాజీ ప్రధాని మరణవార్తా అందలేదు. భావి ప్రధానులు కూడా ఎవరూ చనిపోలేదని మా నిలయ జ్యోతిష్కుల సమావేశం తీర్మానించింది. కనక ఈ సోమవారం సెలవులేదని ప్రకటించటానికి విచారిస్తున్నాం. దీనివలన ఈ రోజు టీవీ రేడియోలలో ఏవో మనోరంజక కార్యక్రమాలు ప్రసారం చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

ఈ విషయమై 412 ప్రధాని గారిని విలేఖరులు అడిగిన ప్రశ్నకు భావి ప్రధానుల జననానికి కూడా యీ సెలవును విస్తరించే పథకాన్ని చేపడతామని అన్నారు."

"ఇప్పుడే అందిన వార్త!" - నవ్వు మొహంతో న్యూస్‌రీడర్ అందుకుంది.



కథా నిలయం
శ్రీకాకుళం

"518వ భావి ప్రధాని జీహుజూర్ సింగ్ గడిచిన వారం మరణించి పాత ప్రభుత్వోద్యోగులకు సెలవు యిప్పించిన వార్త అందరికీ తెలుసు. ఆయన నలుగురు పుత్రులూ వారసత్వం కోసం కోర్టుల ప్రమేయాల్లేకుండా తగాదాను పరిష్కరించుకోవచ్చునని ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వం అద్దెకు యిచ్చిన ఆయుధాలతో, చక్కని భద్రతా ఏర్పాట్ల మధ్య, అన్నదమ్ములు తమ అనుయాయులతో జరుపుతున్న మారణహోమంలో ఒక వారసుడు మరణించినట్లు పి.పి.టి. వార్త. మిగిలిన వారు జరుపుతున్న మారణ హోమాన్ని దూరదర్శన్ ప్రసారం చేయటానికి అన్ని ఏర్పాట్లూ చేసింది. భావి ప్రధానుల అకాల మరణానంతర హత్యాకాండను స్పాన్సర్ చేయటానికి అనేక కంపెనీలకు ప్రభుత్వం లైసెన్సు నిచ్చింది. ప్రజల ఆస్తులనూ, ప్రాణాలనూ కాపాడడానికి కూడా ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉంది. స్త్రీ పురుషుల మానరక్షణ కూడా ప్రభుత్వ కర్తవ్యమే అయినా టీవీ ప్రేక్షకుల సౌకర్యార్థం, పేపర్ల వాళ్ళ డిమాండుల వల్ల ప్రభుత్వం కాపాడవలసిన వాటి లిస్టు నుంచి స్త్రీ మానరక్షణను మినహాయించిందని తెలియజేయటానికి సంతోషిస్తున్నాం!

వార్తల సమయాన్ని తప్పనిసరిగా పొడిగించవలసి వచ్చింది. 518 జీహుజూర్ సింగ్ వారసులు నలుగురూ మరణించారు గనుక కబుర్లాడుకునే పరికరాల చట్టం కింద సెలవు ప్రకటించాం! ప్రభుత్వం యీ సెలవును మరణ పత్రాల పరిశీలనానంతరం ధృవీకరించగలదని ఆశిస్తున్నాం!

సురినామ్ కూడా ఒక గంట క్రికెట్ ఆటలో ఓడించింది."

ఉద్యోగస్తులు టీవీలు, రేడియోలు కట్టేసి దుప్పట్లలో దూరిపోయారు.

సోమవారం లూటీలతో, దహనకాండలతో, మానభంగాలతో గడిచింది.

మంగళవారం మందహాసంతో ప్రవేశించింది.

పాత నగరాలను వార్తా పత్రికలు ముంచెత్తాయి. ఆ దేశంలో మంగళవారం వార్తా పత్రికలకు చాలా గిరాకీ ఉంది. సగానికిపైగా పేపర్లు బ్లాకయిపోతుంటాయి.

ఈ మంగళవారపు మందహాసాల వెనక చాలా కథ ఉంది. అదేంటంటే -

పాతదేశపు పదిహేనవ పార్లమెంటుకు ఎన్నికలు ముగిసాక చాలా పెద్ద మార్పులు వచ్చాయి. ఆ ఎన్నికల నాటికి నాయకులకు కాళ్ళు పట్టేసాయి. గొంతుకలు బొంగురు పోయాయి. నడుములు జారిపోయాయి. జేబులు వట్టిపోయాయి. విమానాల యింజన్లు డౌనయిపోయాయి.

దానికి కారణం -

ఎనిమిది నుంచి పధ్నాలుగు పార్లమెంట్లకు యిరవై ఒక్క నెలల్లో వరుసగా ఎన్నికలు

జరిగాయి. ఉన్న 678 సీట్లనూ 161 పార్టీలూ, స్వతంత్రులూ కలిసి ఆ ఏడు ఎన్నికలలోనూ దాదాపు సమానంగా పంచుకున్నాయి. బూతుల్ని పట్టుకున్నా, సారా పీపాలు ప్రవహింపచేసినా, బాంబులు కురిసినా, తుపానులు మొరిగినా, కుల కక్షలను స్పాన్సర్ చేసినా, కొత్త కులాలను కనిపెట్టి ప్రకటించినా, మత కావేషాలను ఆడియో వీడియో కాసెట్లలో పెట్టి పంచినా ఏ ఒక పార్టీ సింపుల్ మెజార్టీని సాధించలేకపోయింది. బీబీసి దీనికి కారణాల గురించి జరిపిన ఇంటర్వ్యూ హాల్లో పాత రాజకీయ నాయకులూ, మేధావులూ, సంపాదకులూ, రచయితలూ వెలిబుచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించటానికి ప్రయత్నించి తన నిస్పృహాయత ప్రకటించింది. అమెరికాలో అబ్సర్డ్ యూనివర్సిటీలో పాతదేశం మీద ఎక్స్‌పర్ట్ పాతదేశం రాజకీయ ఘటనల వలన ఏర్పడిన వాతావరణ కాలుష్యం గురించి మాత్రం మాట్లాడి ముగించాడు.

అలాంటి పరిస్థితుల్లో పార్లమెంటు బయట ఓ చారిత్రాత్మక సమావేశం జరిగింది.

తిరిగి పార్లమెంటుకు ఎన్నికలు జరపరాదని 678 మందీ ముక్తకంఠంతో శపథం పట్టారు. వారానికొక ప్రధానమంత్రిగా ఆరు వందల డెబ్భై ఎనిమిది మందికి శాశ్వతంగా ప్రధానులుగా అయేందుకు ఒడంబడిక జరిగింది. ఎవరయినా చనిపోతే వారి వారసులకు ఆ వారం ప్రధానమంత్రి అయ్యే హక్కు ఉంటుంది. 678 వారాల తర్వాత రెండవ సైకిలు ఆరంభమవుతుంది. అలా ఆరొందల డెబ్భై ఎనిమిదిమందీ ఆకాశం, చుక్కలూ, చంద్రుడూ ఉన్నంతవరకూ ఆ పాతదేశాన్ని శక్తిమేరకు అనుభవించవచ్చని పార్లమెంటు బయట ఒప్పందం కుదిరింది. లాటరీ తీసారు. ఒక్కొక్కరికీ వరుస నంబరు వచ్చింది.

దాని ప్రకారం  పార్లమెంటు హాల్లో సమావేశం జరిగింది.

సభ్యుల కందరికీ సమానంగా ఒక్కొక్కరికీ ఏభై ఎకరాల స్థలాలో భవంతులూ, వారికి భద్రతా సిబ్బంది, వారికి ఆలనా పాలనా వ్యయాలూ, ప్రత్యేక సిబ్బంది, విమానాలూ, ప్రత్యేక ఓడలూ, ప్రత్యేక రైళ్ళూ, ప్రత్యేక బస్సులూ, ప్రత్యేక సైకిళ్ళూ, ప్రత్యేక స్మశానాలూ.. అన్నింటినీ పార్లమెంటు ఏకగ్రీవంగా చట్టబద్ధం చేసింది.

వరుసగా ఒక్క రోజులో అరవై తొమ్మిది చట్టాలను ఏకగ్రీవంగా పాస్ చేసి పాత పార్లమెంటు గిన్నిస్ ప్రపంచ రికార్డుల పుస్తకంలోకి ఎక్కింది.

విసుగెత్తిన ప్రజలూ, కార్యకర్తలూ ఆ మహోజ్జ్వల క్షణానికి ఆనందోత్సాహాలు చేసుకున్నారు. పై నించి వివిధ కులాల దేవతలూ విడివిడిగా పూలవాన కురిపించినట్లు రేడియో, టీవీలు చెప్పాయి.

అయినా పాతదేశానికి పంటి నొప్పులు తగ్గలేదు.

వివిధ దశల్లో అనేక చిక్కులు వచ్చాయి. వాటిని సరిచెయ్యటానికి రాజ్యాంగాన్ని

9189 సార్లు మార్చారు. తొలి రాజ్యాంగానికీ, చివరి మార్పు తర్వాత రాజ్యాంగానికీ మధ్య పోలికల మీద అనేక దేశాలలో పరిశోధనలు చేసి పిహెచ్.డి.లు తీసుకున్నారు.

ఆ చిక్కులన్నింట్లోనూ ముఖ్యమైనది మగతనపు సమస్య.

ప్రపంచ దేశాలన్నీ తమ మగతన ప్రదర్శనకే పొరుగు దేశాల్తో యుద్ధాలు చేస్తున్నాయి. అయితే అది చాలా ఖర్చు వ్యవహారం. బడుగు దేశాలు అంత ఖర్చు చేసి తమ మగతనం చూపించుకోలేవు. దాంతో తమ దేశాల్లోనే జాతి, భాష, మతం మొదలయిన భేదాలున్నాయి. వీటన్నింటికీ గాలి పోసి, ఎరువు వేసి, నీటి సదుపాయం చేసి సమస్యలుగా పెంచే ఆర్థిక అసమానత్వం ఉంది, పేదరికం ఉంది, నిరుద్యోగం ఉంది. వీటికి తోడు ఈ సమస్యలతో ఉద్రేకపడే జనాలకు దొంగతనంగా ఆయుధాలనిచ్చి ఆయా ప్రభుత్వాలను నిప్పుల మీద పరుగెత్తించి తమ ఆయుధాలకు డిమాండ్ పెంచుకునే అంతర్జాతీయ ఆయుధ వ్యాపార విధానం ఉంది.

దాంతో ప్రపంచదేశాల ప్రభుత్వాలు తమ ఖజానాలను బట్టి తమ తమ మగతనాలను తమ ప్రజల మీదో, పొరుగు దేశాల ప్రజల మీదో చూపించటం సాధారణమయింది.

ఈ మగతనం సమస్య పాతదేశాన్నీ పట్టుకుంది. అయితే శాశ్వత పార్లమెంటు (శాపా) ఈ సమస్యకు ప్రియారిటీ నిచ్చింది. పరిష్కరించింది.

బూతులు పట్టుకునీ, బాంబులు కట్టుకునీ, తుపాకులు స్మగుల్ చేసుకునీ, మారణ హోమాలు జరుపుకునీ, సామూహిక దొమ్మీలు జరుపుకునీ బ్రతుకీడ్చే జనానికీ, తతిమా జనానికీ చాలా తేడా వుందని శాపాకు మేధావులు తెలియజేశారు.

ఈ జనాన్ని ఏక్టివ్ జనమని అనొచ్చన్నారు వారు. అలాంటి వాళ్ళలో ఒక్కడు సాదా సీదా జనంలో వెయ్యిమంది పెట్టు అన్నారు. నువ్వు వాళ్ళని బిజీగా వుంచకపోతే వాళ్ళంతా కలిసిపోయి శాపాకే శాపం కావచ్చని మేధావులు భయపెట్టారు.

దాంతో ప్రభుత్వం అనేక చట్టాలు చేసి యీ జనం తమ మగతనం చూపించుకునే అవకాశం కల్పించింది. హింసాకాండ మారణహోమాలు ఎవరు ఎప్పుడు జరుపుకోవచ్చో నిర్దేశాలు యిచ్చింది. ప్రతిదాన్నీ స్పాన్సర్ చేసేందుకు, కాంట్రాక్టులు తీసుకునేందుకు కంపెనీలకి రాయితీలను యిచ్చి అవకాశాలు కల్పించింది. అక్రమ హింసాకాండలను పట్టుకునేందుకు, కల్తీ మారణహోమాలను గుర్తించేందుకు తనిఖీ విభాగాలను ఏర్పాటు చేసింది.

ఆ విధంగా పాత ప్రభుత్వం క్రింద ప్రజలూ, ప్రభుత్వం జరుపుకుంటున్న హింసా కాండలను విదేశీ టీవీలు ఆదిలో ప్రసారాలు చేశాయి.

"పడకగదిలోనే ప్రత్యక్ష హత్యావ్యాఖ్యానం మాటీవీ నెట్‌వర్క్‌లోనే చూడండి"; "52

కెమెరాలూ 21 సెటిలైట్లూ కలిసి అందిస్తున్న అద్భుత రక్తపాతం వీక్షించండి” - అంటూ అవి ప్రసారం చేసుకున్నాయి.

అయితే అవి పాతదేశ పేద ప్రజలకు అందుబాటులోకి రాలేదు. పాతదేశ ప్రభుత్వం తన ప్రజల గిరాకీని మీటవలేకపోయింది.

సోమవారాన్ని మతకలహాలకూ కులయుద్ధాలకూ, శవయాత్రలకూ, MPM (మాజీ ప్రధానమంత్రి); BPM (భావి ప్రధాన మంత్రి) ల మరణానంతర హింసామహోత్సవాలకూ ప్రభుత్వం కేటాయించింది. ఆ తర్వాత నాలుగు దినాలూ ప్రజల చేత తన్ని పనిచేయించుతోంది.

శనివారాన్ని ఆ వారపు ప్రధాని దిగిపోయేందుకు కారణంగా స్వల్పమోతాదుల్లో రాస్తా రోకో, రైలు రోకో, రైలు ప్రమాదాలూ మొదలైన వాటికి కేటాయించింది. ఆదివారం పార్లమెంటులో పాత ప్రధానిపై అవిశ్వాస తీర్మానం జరుగుతుంది. ఈ సమావేశాలకు ఎవరూ స్వయంగా హాజరవనక్కరలేదు. తమ బంట్రోతులను పంపవచ్చు. మంగళవారం నాడు శాంతి భద్రతలను పరిరక్షిస్తామని PPM (ప్రస్తుత ప్రధాన మంత్రి) ఘోషిస్తారు. బుధ లక్ష్మి వారాలు విదేశీ పర్యటన; శుక్రవారం స్వదేశంలోనే ఏదో ఓ నగరంలో పౌరసన్మానం; యూనివర్సిటీవారి గౌరవపట్టా ప్రదానం జరుగుతాయి.

ఈ షెడ్యూలులో ముఖ్యమైనది సోమవారం.

ఆ హింసా దినానికి హైలైట్ మానభంగాలు. వారమంతా పనిచేసి అలసిపోయిన రక్షకభటులు ఆ రోజు మామూలు పౌరులవుతారు. సెలవు తీసుకుంటారు.

మానవత్వానికి మానభంగాలు మాయని మచ్చలని కొందరూ, ఏ దేశపు మగటి మకయినా అవే మచ్చుతునకలని మరికొందరూ పడక కుర్చీలలో పడుకొని వాదించు కుంటారు. వారితో సహా పేపర్లు కొనగలిగిన మధ్య వర్గాలవారూ, చదవగలిగిన విద్యావంతులూ అంతా మంగళవారం పేపర్ల కోసం ఎదురు చూస్తారు.

మంగళవారం పత్రికలు వార్తలు ప్రచురించవు. ఆ మానభంగాల దృశ్యాలను మాత్రం రంగుల్లో ప్రచురిస్తాయి. ఆ రోజున వార్తలు అచ్చేసిన పత్రికల మీద చర్యలు తీసుకోవాలని విద్యావంతుల సంఘాలు శాపాలో గొడవ చేశాయి. ప్రభుత్వం కూడా ‘చూద్దా’మంటోంది.

ఆ విధంగా విదేశీ టీవీల ప్రత్యక్ష ప్రసారాలను అందుకోలేని అసంఖ్యాక విద్యావంతుల కోసం ప్రభుత్వం మంగళవారం పత్రికలను ఏర్పాటు చేసింది.

ఆ మంగళవారం కూడా జనాలు పత్రికలు కొనుక్కునేందుకు నల్లబజార్లలో బార్లు తీరి నిలబడి ఉండగా ‘తలుపు కన్నం’ అదే పత్రిక ఓ వార్తను ప్రచురించింది.

అది విద్యావంతుల కుతూహల హృదయాలలో దవానలంలా ప్రస్తుతం వ్యాపించింది.

412వ ప్రధాన మంత్రి (PPM) కి మగతనం లేదని 413 అయిన BPM (భావి ప్రధాన మంత్రి) మరియూ ప్రస్తుత ప్రధమ ఉపప్రధానీ ఆ వార్తాపత్రిక జర్నలిస్టుతో అన్నాడట.

వివరాలను రేపు చూడమంది 'తలుపు కన్నం'

పత్రిక కార్యాలయానికి వస్తున్న ఫోన్ కాల్స్ బెడద తప్పించుకోటానికి తమ ఫోన్లన్నిటికీ కనెక్షన్స్ తీసేసింది.

**- 2 -**

సరిగా ఆ రోజు ఉదయం తొమ్మిదవుతూండగా తన విశాలమైన మంచం మీద సుఖనిద్రలో వున్న 412ని కొట్టి మేలుకొల్పింది అతని మూడో భార్య.

భద్రకాళి రూపమెత్తిన ముద్దుల భార్యని చూసి దెబ్బలు తడుముకుంటూ 412 గజగజ వణికిపోయాడు.

"ఏమిటీ వార్త?" – పేపర్ ముఖం మీదకు విసిరింది.

"నీ మొహం మంగళవారం వార్తలేమిటి? వెధవ జోకూ నువ్వూనూ –" 412 భయం భయంగా నవ్వాడు.

"ముందా పేపర్ చూడు తెలుస్తుంది. నువ్వేదో 412 పియమ్ వని మా అయ్య నీకు మూడో పెళ్ళాంగా కట్టబెట్టాడు."

"నేనేం తక్కువ చేసానూ – నీకు మాత్రం పిల్లలు పుట్టలేదా? వాళ్ళకి ప్రధానమంత్రయే వారసత్వం యివ్వలేదా?" అంటూ పేపర్ తీసుకున్నాడు.

"అక్షరాలున్నట్టున్నాయ్ – నువ్వు చదువ్?" అన్నాడు

"నీకు అంతరంగిక సహాయకుల్లేరా పిలువ్?" అంది.

గంట కొట్టి 'అంస'ని రప్పించుకన్నాడు 412.

అంస వార్తను చదివి, 3, 412 ముహాల్లోకి మార్చి మార్చి చూసాడు.

"చదవటం రాదా – పీయేయస్ అయావూ" – ఉరిమాడు 412.

అంస పెదాలు బిగబట్టాడు. వణుకుతూ చదివాడు.

"412 ప్రస్తుత ప్రధానమంత్రికి మగతనం లేదు"

వింటూనే – ఉగ్రరూపంతో 412 లేచాడు. చెయ్యెత్తి అంస మీదకు వచ్చాడు.

"క్షమించండి సార్! ప్రభుత్వోద్యోగులకు PPM యిచ్చే చెంపదెబ్బల కోటా అయిపోయింది సార్!" అన్నాడతను ముందుకి వచ్చి.

412 వెనక్కి తగ్గాడు.

"ఇలాంటి మాట అనడానికి నీకు ఎంత ధైర్యం?"

"అన్నది 413 సార్"

"అతను చదివాడంతే! వేసిన వెధవని పట్టుకోండి" అంది 3

"కరెక్ట్! వెంటనే ఆ పత్రికకు నీళ్ళూ, కరెంటూ ఆపెయ్యండి. పేపరు కోటా తీసెయ్యండి. డ్రైనేజీ లింకులు తెగ్గొట్టేయండి! వాసనొచ్చి చస్తారు వెధవలు...?"

ఆర్డర్లు పాస్ చేశాడు 412.

అంస నోట్ చేసుకున్నాడు.

వికసిత వదనంతో నిష్క్రమించింది 3. ఆమె వెనుకనే ఉద్రేకంగా వెళ్ళబోతున్న అంసను ఆపాడు 412. తలుపులు మూయించి ఆర్డర్లు జారీ చేశాడు.

"ఆ వ్రాసిన జర్నలిస్టును వెంటనే పట్టుకుని యిక్కడ హాజరు పరుచు."

"మీకెందుకు సార్ శ్రమ! సోమవారం దాకా జైల్లో ఉంచి ఆ రోజు సామూహిక దొమ్మిలో తెగ్గొట్టించేస్తాను. అందాకా ఆగలేనంటే యీ రోజే ఎన్‌కౌంటర్ ఏర్పాటు చేస్తాను"

"షటప్! నేనేం చెయ్యాలో నాకు తెలుసు! వాడిని ప్రాణాలతో నా ముందు నిలబెట్టు - క్విక్!"

అంస జిడ్డులా వదలలేదు.

"అసలా మాట అన్నదీ - 413 సార్-"

"యూ బ్లడీ ఫూల్! ఆ జర్నలిస్టు పెడరెక్కలు విరిచి తీసుకురా?... పో! పో"

412 అరుపుతో అంస బయటికి గెంతాడు. కరెంటుకి, డ్రైనేజికి, వాటర్‌కీ, పేపర్ కోటా శాఖలకీ ఫోన్లు కొట్టాడు. గుప్త చర సమూహం డైరెక్టర్‌కి ఫోన్ చేసాడు.

"అయ్యగారు ఆ జర్నలిస్టుని పట్రామన్నారు"

పేపర్‌కి ఫోన్ కనెక్షన్‌లు లేవంది డైరెక్టర్ పి.యే. వెంటనే బలగాన్ని సమాయత్త పరిచాడు.

"పొండి! పాతదేశం నలుమూలలా గాలించండి! గంటలోగా ఆ జర్నలిస్ట్ అయ్యగారి ఛాంబర్‌లో ఉండాలి"

పాతదేశ విద్యా ఉద్యోగ వర్గాలు ఓ పక్క ఆ వార్తతో అట్టుడికి పోతూండగా, మరో పక్క గూఢచారి రక్షకభట వర్గాలు గాలింపులో పడ్డాయి.

పది గంటల దాకా యింట్లో పడుకున్న ఫ్రీలాన్స్ జర్నలిస్టు పచ్చనేత్రం బద్ధకంగా లేచి తయారయి పదకొండుకి 'తలుపు కన్నం' కార్యాలయానికి చేరుకున్నాడు.

పత్రిక అమ్మకాలు చూసుకుని రీప్రింట్‌లో పడి కొట్టుకుంటున్న సంపాదకుడు పచ్చనేత్రాన్ని చూస్తూనే కౌగలించుకుని ఆనందభాష్పాలు విడిచాడు.

"నువ్వు చావబోతూ నన్ను ఒడ్డెక్కిస్తున్నావు పచ్చనేత్రం!" అన్నాడు ఉద్వేగంతో.

పచ్చనేత్రానికి షాక్‌తో నోట మాట రాలేదు.

"నువ్వయ్యా కమిటెడ్ జర్నలిస్టువి! పత్రిక సేల్సు కోసం నీకున్న కమిట్‌మెంట్, నీ త్యాగనిరతీ అనుపమానం! నీ లాంటి జర్నలిస్టులు రోజుకొకరు ప్రాణాలర్పిస్తే నాకు ప్రమోషన్ మీద ప్రమోషన్!! నా పేపర్ సూపర్ మెగా రెబల్ పేపరవుతుంది! మిగిలినవి పాపర్లవుతాయి!" అన్నాడు మరింత ఉద్వేగంతో!

అప్పటికీ పచ్చనేత్రం నోరు విడలేదు.

"నీ ఫామిలీ గురించి బెంగెట్టుకోకు! నేను చూసుకుంటాను! నాకు ప్రభుత్వ వర్గాలలో చాలా ఇన్‌ఫ్లుయెన్స్ ఉంది! నువ్వు ఎలాంటి చావు చచ్చినా మాంచి కాంపెన్సేషన్ దొరికే చావుగా నమోదు చేయిస్తాను - కమాన్!" అన్నాడు కౌగిలి వదలకుండా!

"యితనేనండి ఆ జర్నలిస్ట్! తీసుకుపోండి! చంపేసుకోండి!" అన్నాడు అక్కడే కూర్చున్న గుప్తచరులతో.

పచ్చనేత్రం భయావహంగా అరుస్తూండగా అతన్ని ఎక్కించుకున్న వాహనం 412 భవంతిలోకి ప్రవేశించింది. అక్కడ ఆపి డైరెక్టర్‌కి ఫోన్ చేశారు ఆనందంగా.

ఆయన వచ్చి స్వయంగా పచ్చనేత్రాన్ని మోసుకుని ఆంసకి అప్పజెప్పాడు.

ఆంస అతన్ని 412 ఛాంబర్స్‌లో చేర్చాడు.

అందరినీ బయటికి పొమ్మన్నాడు 412.

**- 3 -**

అందర్నీ పంపేసి పొడవాటి తలుపుల్ని మూస్తున్న 412ని చావు భయంతో బిగుసుకుపోయిన పచ్చనేత్రం పరిశీలించాడు.

412 అర్భకంగా పీలగా ఉన్నాడు. తనూ, అతనే యీ గదిలో వున్నారు. తన ముందు పిట్టలా ఉంటాడు! ఎందుకూ చాలడు! ఇలా వెనక్కి తిరిగి తనను చంపటానికి ఏ రివాల్వరో తీసేలోగా తనే అతన్ని నోరు మూసీ పీక నులిమీ చంపెయ్యవచ్చు. ఎలాగూ తనకీ చావు తప్పదు. చచ్చేముందు ఓ PPMని చంపితే ఎంత సెన్సేషన్! ఎంత పేరు! చరిత్రలో మిగిలిపోతాడు! ఈ చిన్న లాభాలు అటుంచి ప్రభుత్వోద్యోగులకి మూడు రోజుల సెలవు దొరుకుతుంది. తన భార్యా ప్రభుత్వోద్యోగే! బ్రతికున్నన్నాళ్ళూ కాల్చుకుతిన్నా చచ్చి సుఖపెట్టాడని ఎంతో సంతోషిస్తుంది! శాశ్వత ప్రధాన మంత్రి వ్యవస్థా వ్యతిరేక సంఘం (SPMVVS) అనే టెర్రరిస్టు సంస్థ తన బోటి అమరవీరుడిని తమ సభ్యుడిగా CLAIM చేసుకున్నా చేసుకోవచ్చు. తన భార్యకి భారీ ఎత్తున ధనం యిచ్చినా యివ్వొచ్చు! లక్కిఛాన్స్! పద పచ్చనేత్రం! కదులు -

అలా పచ్చనేత్రం నిర్ణయించుకుని అడుగు వేసే సరికి ఆలస్యం అయిపోయింది!

ఆ పొడవాటి తలుపుల్ని మూసి గడియ పెట్టిన 412 ఆయాసాన్ని ఓర్చుకుంటూ వెనుదిరిగాడు.

పచ్చనేత్రం బిగుసుకుపోయాడు.

ఒక్కొక్క అడుగూ వేస్తూ అతన్ని సమీపిస్తున్నాడు 412.

అదిగో! 412 చెయ్యి కదుల్తోంది! ఆ లాంగ్‌కోట్ జేబులోకి వెళ్తోంది.

పచ్చనేత్రం కళ్ళు రెప్ప మూయటంలేదు.

శరీరం బిగుసుకుపోతోంది.

412 దగ్గరగా వస్తున్నాడు!

వచ్చేస్తున్నాడు!

వచ్చేసాడు!

412 జేబులోంచి ఏదో తీసాడు!

పచ్చనేత్రం భయంతో కళ్ళు మూసుకున్నాడు

సైలెన్సర్ ఉండే ఉంటుంది.

లేకపోతే శబ్దం వినబడదూ!

వినబడితే PPMకి భయమేంటి? చంపటానికో కోటా, చంపించటానికో కోటా ఉండనే ఉన్నాయి గదా! దానికి శాపా ముద్ర కూడా ఉంది.

తన కాళ్ళను ఏదో చుట్టటంతో కళ్ళు విప్పాడు పచ్చనేత్రం.

జేబులోంచి తీసిన నోట్ల కట్ట అతని పాదాల దగ్గరుంచి కాళ్ళు పట్టుకుని వున్నాడు 412!

ఏం జరిగిందీ పచ్చనేత్రానికి అర్థం కాలేదు.

ఒళ్లు గిల్లుకుని, స్పృహ తెచ్చుకుని, పచ్చనేత్రం 412 భుజాలు పట్టుకుని లేవనెత్తాడు.

"ఏంటి సార్! ఏంటిది?"

"ఈ డబ్బు తీసుకో! నాకో పని చేసి పెట్టు"

"ఆజ్ఞాపించండి సార్!"

"ఈ రహస్యం నీకెలా తెలిసింది?"

"ఏ రహస్యం?"

"పత్రికలో వేసినది..."

"అదా... అది....అది..అదేంటంటే..."

"నాకు తెలుసు 413 నీతో అన్నాడు! నేనూ పత్రిక చదివించుకోగలను! నాకూ

తెలుసు! కానీ..."

"413 గారు అసలు అన్నదేంటంటే...."

"నాకు తెలుసు వాడేమన్నదీ...? ఈ రహస్యం వాడికెలా తెలిసిందో నాకు తెలుసు! ఈ రహస్యం కాపాడుకోటానికే నేను ముగ్గుర్ని పెళ్ళాడాను! పదకొండు మంది పిల్లలకు తండ్రి నయాను! ఇన్ని ఏర్పాట్లు చేసాను. ఏ రోజుకి ఆ రోజు వాళ్ళకి సుఖం నాగా లేకుండా ఏర్పాట్లు చేశాను! అయినా ఆ ముగ్గురు లంజలకీ విశ్వాసం లేదు! పాతివ్రత్యం లేదు! భయం లేదు! వాళ్ళలో ఎవరు 413కి ఒళ్ళిచ్చిన పాతకి? ఎవరు నా రహస్యాన్ని వాడికి చెప్పిన భ్రష్టురాలు! నువ్వు ఆ 413ని ఎల్లా పడతావో నాకు తెలీదు... ఏం చేస్తావో తెలీదు.... నువ్వు ఆ రహస్యాన్ని నాకు రేపట్లోగా కనిపెట్టి చెప్పాలి. నీ పేరు పాతశ్రీ బిరుదుల కోటాలో చేరుస్తాను. లేకపోతే కాంపెన్సేషన్ లేని సాముహిక దొమ్మీల్లో చంపించేస్తాను.... నువ్విది కనిపెడితే డబ్బు, బిరుదు, బ్రతుకు... అన్ని దొరుకుతాయి."

412 మాటలు దుఃఖంలో మునిగి, కోపంలో తేలి బీభత్సంగా పేలాయి.

412 సర్దుకున్నాక పచ్చనేత్రం అన్నాడు.

"సార్!"

"ఏంటి?"

"మీరు ఒక్క కూనీ కూడా స్వయంగా చెయ్యలేదుట!! ఒక్క రేప్ కూడా చేయలేదుట. కనీసం ఒక్క రేప్ కేసులో కూడా అరెస్ట్ అవలేదుట! చిట్టచివరికి కనీసం మీ పేరు పాత నేరస్థుల క్రింద కూడా నమోదవలేదుట! 678 మందిలో అంతలాంటి రికార్డు మీకు ఉందిట! మగతనం ఉన్న ఎవరికీ అలాంటి రికార్డ్ ఉండదట! అదీ 413గారు నాతో అన్నది! దాన్ని సెన్సేషనల్‌గా మార్చి పేపరు అమ్ముకుందామని అలా ప్రచురించాను అంతే!" అన్నాడు పచ్చనేత్రం జాలిగా చూస్తూ.

"నిజంగా అంతేనా 413 అన్నది?"

"అంతేసార్! శాపా మీద ఒట్టేసి చెబుతున్నాను."

చటుక్కున జేబులోంచి రివాల్వర్ తీసాడు 412.

అతని చేతులు వణుకుతున్నాయి.

ఢాం! ఢాం! ఢాం!

"678లో నేను మాత్రం ప్రత్యేకంగా ఎందుకుండాలి పచ్చనేత్రం?" - దుఃఖంతో ప్రశ్నించాడు 412.

మెరుస్తున్న కళ్ళతో మెచ్చుకోలు చూపుల్తో అతన్నే చూస్తూ తృప్తిగా కళ్ళు మూసాడు పచ్చనేత్రం!

## కథాప్రహేళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!

**"పిఎమ్ 412"** కథా నిర్మాణంలోని మంచీ, చెడులను హృద్యమంగా, ఆలోచన రేకెత్తించే విధంగా విశ్లేషించారు. మంచి కథ తెలుగు సాహితీలోకంలో ఇక ముందు కూడా తన స్థానాన్ని సగర్వంగా సుస్థిరం చేసుకోవాలన్న కోరిక పాఠకులలో బలీయంగా ఉందని దీని మూలకంగా మరోసారి రుజువవుతోంది. ఇది శుభ పరిణామం.

నెలనెలా మాకు అందుతున్న పాఠకుల ప్రతిస్పందన చూస్తుంటే సాహసంతో మేము ప్రవేశపెట్టిన ఈ శీర్షిక ప్రయోజనం సిద్ధిస్తుందనే నమ్మకం బలపడుతోంది. 'మంచి తెలుగు కథ' కోసం నిరంతరం ఆవేదన పడే రచయిత అంతర్మథనం నుండి ఉద్భవించిన శీర్షికే ఇది. విజ్ఞులైన పాఠకులు, రచయితలు, సాహితీ జిజ్ఞాసువులు ఈ శీర్షికను సంయమనంతో పరిశీలించి రచయిత ఆశయానికి చేయూతనివ్వగలరని నమ్ముతున్నాము.

'పి.ఎమ్. *412*' కథ మీది విశ్లేషణలో బహుమతులు అందుకున్న పాఠకుల వివరాలివి:

నచ్చిన అంశం : **కె.వి. కృష్ణప్రసాద్** (నెల్లూరు); **కె. రామారావు** (హైదరాబాద్).

నచ్చని అంశం : **రవితేజ** (గద్వాల); **జి. ప్రేమ్‌కుమార్** (పటాన్‌చెరు).

ఈ నెల పోటీలో పాల్గొన్న పాఠకులందరి పేర్లూ వెయ్యాలంటే కనీసం రెండు పేజీలు కేటాయించాలని తేలింది. ఆ కారణంగా అందరి పేర్లనూ ప్రచురించలేని మా అశక్తతను

మన్నించమని కోరుతున్నాం.

చాలామంది పాఠకుల సూచనలను దృష్టిలో ఉంచుకుని రెండవ బహుమతి విజేతలకు దాదాపు యాభై రూపాయలు విలువ చేసే 'మంచి కథా సంకలనా'లను పంపించడానికి నిర్ణయించాము. - సం.

నచ్చిన అంశం

### ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

చిన్న పిల్లాడికి తల్లిపై కోపం వస్తే ఇల్లంతా చిందర వందర చేసేస్తాడు. ఆ తర్వాత ఆవిడ చేత నాలుగు తగిలించుకుంటాడు. కథాప్రహేళిక -2కి "వ్యవస్థ" మీద చాలా కోపం వచ్చింది.

అడుగడుగునా వ్యంగ్యం మైమరపించిన మాటెంత నిజమో మరికొన్ని చోట్ల "కమిట్‌మెంట్ లోపం" కనిపించడమూ అంతే పచ్చి నిజం.

పాతదేశ పి.ఎమ్. 412కి రష్యా, చైనా, ఇండియాల నుండి శుభాకాంక్షలు అందడం; పాతదేశం సురినామ్‌తో జరిగిన ఒక గంట క్రికెట్ ఆటలో ఓడిపోవడం (అద్భుతమైన సెటైర్): సురినామ్ భారతదేశాన్ని ఒక గంట క్రికెట్ ఆటలో ఓడించడం - ఈ మూడు వాక్యాల వల్ల భారతదేశం, ఇండియా వేర్వేరని తెలియబరచింది కథాప్రహేళిక-2, థేంక్స్ ఫర్ ది సూపర్బ్ ఇన్వెన్షన్!

"పాత ప్రభుత్వోద్యోగులు" అంటే ఉద్యోగ విరమణ చేసిన వాళ్ళనా? (సంధి విడదీయాలండీ బాబు!) ఇక అమెరికాలోని 'అబ్సర్డ్ యూనివర్సిటీని' కనుగొన్నది. వ్యవస్థ దేవుణ్ణి మతాల పేరుతో "పెద్ద ముక్కలు"గా కట్ చేస్తే, ఈ కథాప్రహేళిక-2 కులాల వారీగా "చిన్న ముక్కలు"గా చేసింది. ఆహా ఏమి వ్యంగ్యం? ధన్యవాదాలు.

పి.ఎమ్. 412 మగతనం నిరూపించిన ముగింపు అద్భుతం! ముగింపు కోసం చదవాల్సిన కథ ఇది. అంతే!

- కె.వి. కృష్ణప్రసాద్

### ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ

జనవరి సంచికలో ఒక సుప్రసిద్ధ కథారచయిత కథ 'పిఎమ్ *412*' చదివాను. మీరన్నట్టు అతి శ్రద్ధగా చదివాను. ఇక అభిప్రాయం రాయటానికి పూనుకుంటే మెదడు పనిచేయలేదంటే నమ్మండి. ఇదొక వ్యంగ్య రచన - రాజకీయముపై అని గ్రహించ గలిగాను. అంతవరకే. ఇంతవరకు ఇలాంటి థీమ్ ఉన్న కొన్ని వందల కథలు ప్రసిద్ధ రచయితలవి చదివాను. అందులోని వ్యంగ్యం అర్థం చేసుకొని కడుపార నవ్వుకున్నాను. కాని ఈ కథ మట్టుకు ఒక సామాన్య తెలుగు పాఠకుడిగా జీర్ణించుకోలేకపోయాను. ఇక

నచ్చినవి - నచ్చనివి రాయటానికి ఏముంది? అయితే ఒక మనవి. పాఠకులకి ఇంత కఠిన పరీక్ష మాత్రం పెట్టకండి.

- కె. రామారావు

నచ్చని అంశం

### ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

మొదటి సంచికలో మేలిమి బంగారం లాంటి కథల నందించిన 'రచన' రెండవ సంచికలో 'పిఎమ్ 412' కథ ప్రచురించి తన ప్రమాణాలను దిగజార్చుకుంది.

కథ జనజీవనానికి దగ్గరగా, వాస్తవికంగా వుండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 'పిఎమ్ 412'లో అలాంటి కథా లక్షణాలేవీ కనిపించవు.

రచయిత కథా ప్రయోజనాన్ని తుంగలో తొక్కి పూర్తి అసంబద్ధతలో నడిపించాడు. భవిష్యత్తును చిత్రిద్దామన్న రచయిత ఉద్దేశం మంచిదే. ఎటొచ్చీ ఆ కథావస్తువును కాగితంపై పెట్టడంలోనే రచయిత అనేక తప్పటడుగులు వేశాడు.

భవిష్యత్తులో ప్రగతి సంభవమనే ఆశావాదిగా బ్రతకాలి రచయిత. అలా అని భవిష్యత్తు అంతా 'రంగుల కల' అని ఊహించమనట్లేదు. సరే! - "భవిష్యత్తులో పరిస్థితులు మరింత అస్తవ్యస్తంగా, అసహ్యంగా వుండాలని రచయిత భావన" అనుకొంటే "ఉద్యోగులంతా ఎప్పుడెప్పుడు సెలవులొస్తాయా? అని సోమరిపోతుల్లా, గోతికాడ నక్కల్లా ఎదురు చూడడం, వారానికో ప్రధానమంత్రి మారడం, ప్రధానమంత్రిని చంపడానికో కోటా, చంపించడానికో కోటా వుండడం మొదలైన అబ్సర్డ్ భావాలను కథలో ఇరికించి పాఠకులను విసిగించాడు రచయిత.

కథా రచయిత కథనాన్ని (పొడిగించడం) కొనసాగించేటప్పుడు పాఠకుల్ని మెస్మరైజ్ చేసి తన వెంట తీసుకుపోగలగాలి. సైన్స్ ఫిక్షన్ కథలకు ఇది అత్యంతావశ్యకం. అందుకు రచయిత కథకు అవసరమైన నేపథ్యాన్ని సృష్టించడంలో కృతకృత్యుడు కావలసి వుంటుంది. రచయిత అలాంటి ప్రయత్నాలేవీ చేయకపోవడం ఈ కథకు పెద్దలోటు.

- రవితేజ

### ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణ

అతి భయానకమైన కల్పన కూడి, వాస్తవానికి దగ్గరగా ఉంది. మన దేశ స్థితిగతులను, మేడిపండు వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన వ్యవస్థకు ప్రతిబింబం.

కథ జుగుప్సను పుట్టిస్తుంది. కథ కూర్చిన విధం, కథాంశం బాగుంది. కథలో అసంబద్ధత కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. అందుకే నాకు యేమాత్రమూ నచ్చలేదు.

- జి. ప్రేమ్‌కుమార్

## కథాప్రహేళిక పాఠకవర్యులారా! ఓ నివేదన!!

'కథాప్రహేళిక'లో మొదటి కథ "సయ్యాట" మీద వచ్చిన వ్యాసాలలో అధికభాగం తిడుతూ రావటం శీర్షిక ఉద్దేశ్యానికి అనుగుణంగా ఉంది.

రెండవ కథ "పిఎమ్ *412*" మీద సరైన అభిప్రాయాలు అంతగా లేవు.

కారణం ఏమిటయుంటుంది?

కథ అర్థం కాకపోయుండాలి?

అర్థం చేసుకోగలవారికి అభిప్రాయం చెప్పే ఉత్సాహం కలగకపోయుండాలి. అంటే – అభిప్రాయాలు చెప్పాలని ఉత్సాహపడే వారికి అర్థమయ్యే పద్ధతిలో కథ రాయబడలేదు.

ఈనాటి రాజకీయ దుర్వ్యవస్థకు కారికేచర్‌గా రాయబడిన ఈ కథ అర్థం చేసుకోగలవారు – చేసుకున్నవారు తమ అభిప్రాయాలను వ్రాతపూర్వకంగా చెప్పటంలేదు.

సాహిత్యమూ, తదితర కళారూపాలూ తమ సంస్కారాలనీ, నైజగుణాలనీ ప్రభావితం చేస్తుంటే గుర్తుపట్టలేనివారు వేరు.

వాటిని తప్పు పట్టగలిగే వారు వేరు.

దాన్ని బట్టి –

మొదటి వారిని ఈ శీర్షిక కొంతయినా కలుపుకుని రాగలిగింది.

రెండవ వారిని మాత్రం ఇది ఇన్‌వాల్వ్ చేయలేకపోయింది.

మొదటి వారిని రెండవ వారు పట్టించుకోవాలని మా నివేదన. ఎందుచేతనంటే – ప్రతి కళారూపమూ ప్రజాధనం మీదనూ, ప్రజాభీష్టానుగుణంగానూ మాత్రమే జీవించగలవు.

కనక –

ప్రజలలో అభిప్రాయాలు చెప్పే అలవాటు ఏర్పడాలి. ప్రజాస్వామ్య వేదికలను నిర్మించుకోడంలో మాత్రమే ప్రజాస్వామ్య బలం లేదు. ఆ వేదికలను అప్రమత్తతతో పరిరక్షించుకోవటంలో కూడా దాని బలం ఉంది. అందుకొక విధానం – ఇన్‌వాల్వ్ కావడం! అభిప్రాయాలు కలిగి ఉండడం! వాటిని చెప్పగలిగి ఉండడం!

సాహిత్యానికి సంబంధించిన ఈ ప్రయత్నంలో అందరి సహకారమే మాకు ఉత్సాహాన్నిస్తుంది.

– రచయిత